
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి
5
మెదక్
జిల్లాల వార్తలు
శనివారం 9 నవంబరు 2024





నాంపల్లిలోని ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన కొమురవెల్లి మల్లన్న విగ్రహ నమూనా

ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో కొమురవెల్లి మల్లన్న

నమూనా విగ్రహం ఏర్పాటు

చేర్యాల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మ ప్రచారంలో భాగంగా రాష్ట్రంలోని ప్రముఖ ఆలయాల దేవతామూర్తుల నమునా విగ్రహాలను భక్తుల సందర్శనార్థం నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నెలకొల్పేందుకు దేవాదాయశాఖ సంకల్పించింది. ఇందులో భాగంగా సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి మల్లన్న నమూనా విగ్రహాన్ని శుక్రవారం ఏర్పాటు చేశారు. ఈవో బాలాజీశర్మ ఆధ్వర్యంలో అర్చకులు పడిగన్నగారి ఆంజనేయులు, మహదేవుని మనోహర్, శివప్రసాద్, శివకుమార్ తదితరులు ప్రత్యేకపూజలు నిర్వహించారు.

మెడికల్ కాలేజీ భవనాలకు రూ.20 కోట్లు

- మంజూరు చేస్తూ సర్కారు ఆదేశాలు
- తొలి ప్రాధాన్యంగా హాస్టళ్ల నిర్మాణం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

సంగారెడ్డి అర్బన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డిలోని ప్రభుత్వ మెడికల్ కళాశాల, హాస్టల్ భవనాల నిర్మాణ పనులు మళ్లీ ఊపందుకోనున్నాయి. 'అద్దె భవనాల్లో హాస్టళ్లు.. ఆన్‌లైన్‌లో తరగతులు' శీర్షికతో గురువారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి ప్రభుత్వం స్పందించింది. ఈ మేరకు తక్షణమే రూ.20 కోట్లు మంజూరు చేయాలని ఆదేశాలు వచ్చినట్లు డీఎంఈ అధికారులు తెలిపారు. చేసిన పనులకు బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్ పనులు నిలిపేసిన విషయం తెలిసిందే. భవనాలు పూర్తికాకపోవంతో వైద్య విద్యార్థుల హాస్టళ్లను అద్దె భవనాల్లో కొనసాగిస్తున్నారు. తరగతి గదులు లేక మొదటి ఏడాది ఎంబీబీఎస్ తరగతులు ఆన్‌లైన్‌లో కొనసాగిస్తున్నారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి'తో కథనం రావడంతో ప్రభుత్వం వెంటనే నిధులను మంజూరు చేసింది. మొదటి ప్రాధాన్యతగా హాస్టల్ భవనాలు పూర్తిచేసి అప్పగించాలని సదరు కాంట్రాక్టర్‌ను ఆదేశించినట్లు వైద్య విద్య అధికారవర్గాలు తెలిపాయి.

కాంగ్రెస్ ప్రభుత్వానిది రాక్షసానందం

- అధికారం కట్టబెట్టింది బాంబులు పేల్చడానికేనా?
- శాసనమండలిలో ప్రతిపక్ష నేత, మాజీ స్పీకర్ మధుసూదనాచారి

7



చేగుంట మండలం సుభాన్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో ఒకే గదిలో విద్యార్థులను వేర్వేరుగా విభజించి పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయుడు

గురువులు కరువు

- కొత్త టీచర్లను నియమించినా తీరని వెతలు
- ఉమ్మడి జిల్లాలో 1,378 పోస్టులు ఖాళీ
- టీచర్లు లేక పల్లెల్లో మూతపడుతున్న పాఠశాలలు
- రేషనలైజేషన్ చేయకపోవడంతో బోధనలో సమస్యలు
- ఒక్కో స్కూల్‌లో ఒక్కోతీరుగా నియామకం

జిల్లా	కొత్త టీచర్లు	ఖాళీలు
సంగారెడ్డి	391	573
సిద్దిపేట	285	388
మెదక్	275	417

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, నవంబరు 8: ప్రభుత్వ పాఠశాలలను ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. విద్యార్థులకు తగినట్లు ఉపాధ్యాయుల నియామకాలు చేపట్టకపోవడంతో విద్యార్థుల చదువుపై ప్రభావం పడుతున్నది. ఒక్కో ఉపాధ్యాయుడు ఒకేసారి ఐదు తరగతులకు బోధించాల్సిన దుస్థితి ఏర్పడుతోంది. ఇటీవల కొత్త ఉపాధ్యాయులను నియమించినప్పటికీ ఉమ్మడి మెదక్ జిల్లాలో అడ్డగోలుగా ఖాళీలు ఉన్నాయి. వీటన్నింటినీ భర్తీ చేస్తేనే ప్రభుత్వ పాఠశాలకు పునర్వైభవం

మిగతా 7వ పేజీలో



మునిపల్లి మండలం మన్సాన్‌పల్లిలో ఉపాధ్యాయుడు లేక మూతపడిన పాఠశాల

> 'అల్లాదుర్గం మండలం రాంపూర్‌లోని ప్రాథమికోన్నత పాఠశాలలో ఎనిమిది తరగతుల్లో 80 మంది విద్యార్థులు ఉండగా.. ఇద్దరు ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారు. శుక్రవారం ఇందులో ఒకరు సెలవు పెట్టడంతో ఒకే ఉపాధ్యాయుడు ఎనిమిది తరగతులను నిర్వహించాల్సి వచ్చింది. ఇక్కడ గతంలో ముగ్గురు ఉపాధ్యాయులు ఉండేవారు.'

> 'మద్దూరు మండలంలోని ధర్మారం, బంజర, వంగపల్లి, పిట్టల గూడెం గ్రామాల్లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో ఇద్దరు టీచర్లకు ఒక్కొక్కరే ఉన్నారు. ఇంకా మద్దూరు ఎంపీపీఎస్‌లో ముగ్గురు, గాగిల్లాపూర్ ప్రాథమికోన్నత పాఠశాలలో నలుగురు, వల్లంపట్లలో ఇద్దరు, మర్మాముల ప్రాథమికోన్నత పాఠశాలలో ఇద్దరు ఉపాధ్యాయులు అవసరం.'

> 'పటాన్‌చెరు మండలం ఇంద్రేశం ప్రాథమికోన్నత పాఠశాలలో ఒకటి నుంచి 8 తరగతుల్లో 379 మంది విద్యార్థులు ఉండగా.. 8 మంది టీచర్లే బోధిస్తున్నారు. నిబంధనల ప్రకారం 30 మంది విద్యార్థులకు ఒకరు చొప్పున 13 మంది ఉపాధ్యాయులు పాఠాలు బోధించాల్సి ఉంది. కానీ ఉపాధ్యాయుల కొరత కారణంగా ఎనిమిది మందికే పరిమితం చేశారు.'



ఫెస్ట్‌లో పాల్గొన్న విద్యార్థులు

బీవీఆర్ఐటీలో చెమురా 2.0

నర్సాపూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): బీవీఆర్ఐటీ ఇంజనీరింగ్ కాలేజీలో చెమురా 2.0 ఫెస్ట్ శుక్రవారం ఉత్సాహంగా సందడిగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా పలు విన్నూత గేమ్స్ నిర్వహించారు డెవిల్ ఇన్ ది డిటెయిర్స్, పిక్చర్ పర్ఫెక్ట్, మోడల్ మార్వెల్ తదితర పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతిభ చూపిన వారికి ప్రిన్సిపాల్ సంజయ్‌దూబే ఆధ్వర్యంలో బహుమతులు అందజేశారు. విద్యార్థుల్లో కలిసి పనిచేసే సామర్థ్యాన్ని అభివృద్ధి చేసుకోవడానికి ఇలాంటి ఫెస్ట్‌లు ఉపయోగపడతాయని ఆయన పేర్కొన్నారు.

ఆదాయం ఉన్నా.. అందని ఆర్టీసీ సేవలు



- తిరోగమనంలో ఖేడ్ డిపో
- వేధిస్తున్న సిబ్బంది కొరత
- కొత్త బస్సులూ లేవు
- గ్రామాలకు బస్సు సౌకర్యం లేక ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్న ప్రజలు

8



సర్వే పకడ్బందీగా చేపట్టాలి

ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి హరిచందన

7

పండ్ల తోటలకు ఉపాధిహామీ

- దీర్ఘకాలికంగా ఆదాయాన్నిచ్చే తోటల పెంపకానికి చేయూత
- మూడేళ్ల వరకు నిర్వహణకు నిధులు
- మండలానికి 100 ఎకరాల లక్ష్యం
- సబ్సిడీపై డ్రిప్ సౌకర్యం

7



రైతుల పంటను ప్రభుత్వమే కొంటుంది

- 15 రోజుల్లో చెల్లింపులు
- వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ



సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి దామోదర్ రాజనర్సింహ

రాయికోడ్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రైతులు పండించిన ధాన్యం, పత్తిని ప్రభుత్వమే మద్దతుధరకు కొనుగోలు చేస్తుందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. మండల పరిధిలోని నాగువ శివారులోని ఎస్‌బీఎఫ్ కాటన్‌మిల్లులో సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. అనంతరం మాటూర్ శివారులో నూతనంగా నిర్మించిన గోదావరి-గంగ షుగర్‌ప్యాక్టరీని జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెరకు పంటకు ప్రసిద్ధిగాంచిన జహీరాబాద్ ప్రాంతంలో షుగర్ ఫ్యాక్టరీలు మూత పడటంతో రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లాల్సి వచ్చిందన్నారు. రైతుల ఇబ్బందులు తీర్చడం కోసం నూతన షుగర్ ఫ్యాక్టరీని శంకుస్థాపన చేసిన ఎనిమిది నెలల్లోనే పూర్తిచేసి చెరకు గానుగ సీజన్ లోపు అందుబాటులోకి తీసుకువచ్చామని తెలిపారు. ఇతర ఫ్యాక్టరీలు ఇచ్చే మద్దతు ధరకే ఇక్కడా చెరకు పంటను కొనుగోలు చేస్తారని మంత్రి పేర్కొన్నారు. నిజాం షుగర్స్‌పై వేసిన సబ్‌కమిటీ నివేదిక ఆధారంగా మెదక్, జహీరాబాద్‌లోని ఫ్యాక్టరీలపై నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. జహీరాబాద్ ప్రాంత చెరకు రైతులకు పూర్వవైభవం తీసుకువచ్చేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తుందని హామీ ఇచ్చారు.

అనంతరం అల్లాపూర్ శివారులోని గురుకుల పాఠశాల, మోడల్ స్కూల్, కేజీబీవీ స్కూల్ హాస్టళ్లను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వసతుల కల్పనకు అవసరమైన నిధులు మంజూరు చేస్తామని ప్రకటించారు. కార్యక్రమంలో సెట్విన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ గొల్ల అంజయ్య, జహీరాబాద్ ఆర్డీవో రాంరెడ్డి, ఏఎంసీ చైర్మన్ సుధాకర్‌రెడ్డి, నాయకులు సిద్దన్నపాటిల్, బస్వరాజ్‌పాటిల్, కేదారినాథ్‌పాటిల్, సతీష్‌కుమార్, వినయ్‌కుమార్, మహంకాళి సతీష్, కులకర్ణి ఏసయ్య, నాగిశెట్టిపటేల్, శేషారెడ్డి, దిగంబర్ రావు, ఉజ్వల్‌రెడ్డి, ఆయా మండలాలకు చెందిన నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న ట్రాక్టర్

- ఇద్దరు కూలీలు మృతి
- నలుగురికి తీవ్ర గాయాలు

రాయికోడ్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): కూలీలతో వెళ్తున్న ఆటోను ట్రాక్టర్ ఢీకొనడంతో ఇద్దరు మహిళలు మృతి చెందగా మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన మండల పరిధిలోని నల్లంపల్లి చౌరస్తా వద్ద శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్ఐ నారాయణ తెలిపిన వివరాల ప్రకారం జహీరాబాద్ పట్టణం భరత్ నగర్, శాంతినగర్‌కు చెందిన కూలీలు పత్తి తీసేందుకు రాయికోడ్ మండలం పీపడ్‌పల్లి గ్రామానికి ఉదయం వెళ్లారు. పని ముగించుకుని సాయంత్రం జహీరాబాద్‌కు వెళ్తున్న క్రమంలో రాయికోడ్ మండలం నల్లంపల్లి చౌరస్తా వద్ద వారు ప్రయాణిస్తున్న ఆటోను ట్రాక్టర్ ఢీకొట్టింది. ప్రమాదంలో ఆటోలో ఉన్న నర్సమ్మ (55) లాల్‌బీ(19) అక్కడికక్కడే మృతి చెందారు. ఆటో డ్రైవర్ జావిద్‌తో పాటు రజియా, సానియా, మైమూనిలకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని 108లో జహీరాబాద్ ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



బతుకు రిక్షా బండి

బతుకు బండి సాగడం కోసం ఓ కుటుంబం రిక్షాలో చిత్తు కాగితాలు, ప్లాస్టిక్ వస్తువులు పోగు చేసి విక్రయిస్తున్నారు. సంగారెడ్డి పట్టణంలో ఈ దృశ్యం కనిపించింది.

-సంగారెడ్డి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి



నిరుపయోగంగా మారిన ఫౌంటేయిన్



పార్కులో పేరుకుపోయిన చెత్తకుప్ప



పిచ్చిమొక్కలు.. చెత్తకుప్పలు!!

అధ్వానంగా సంగారెడ్డి రాజీవ్‌పార్కు

జిల్లాకేంద్రమైన సంగారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని రాజీవ్‌పార్కు నిర్వహణను అధికారులు గాలికి వదిలేశారు. రూ. 1.35 కోట్లు వెచ్చించి నిర్మించిన పార్కును 2010 అక్టోబర్ 17న అప్పటి ముఖ్యమంత్రి కే.రోశయ్య ప్రారంభించారు. కానీ, కొద్దిరోజులకే పార్కు నిర్వహణ సరిగ్గాలేక అధ్వానంగా తయారైంది. దీంతో ఆధునీకరించేందుకు 2019లో రూ.95 లక్షలు మంజూరు చేశారు. అయినా, పార్కు దశ మారలేదు. పిచ్చిమొక్కలు, చెత్తకుప్పలతో అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది.

-సంగారెడ్డి రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి)

ఆన్‌లైన్ గేమ్స్‌కు అలవాటుపడి చోరీలు

ముగ్గురిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించిన జహీరాబాద్ పోలీసులు

జహీరాబాద్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్‌లైన్ గేమ్‌లకు అలవాటుపడి డబ్బు కోసం చోరీలకు పాల్పడుతున్న ముగ్గురిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. డీఎస్పీ రామ్మోహన్‌రెడ్డి నేతృత్వంలో శుక్రవారం జహీరాబాద్ పట్టణంలోని వస్తాపూర్ చౌరస్తా వద్ద నిర్వహించిన వాహనాల తనఖీల్లో హోతి(బి)కి చెందిన ముస్తాక్‌హుస్సేన్, సిరిసిగ మహేష్, గాజుల పవన్‌రెడ్డి బైక్‌పై అనుమానాస్పదంగా వెళ్తుండగా పట్టుకున్నారు. పట్టణ పోలీస్‌స్టేషన్‌కు తరలించి విచారించగా వారు ఆన్‌లైన్‌గేమ్‌లకు అలవాటుపడి డబ్బులు సరిపోక దొంగతనాలకు పాల్పడుతున్నారని గుర్తించారు. గతంలో మొగుడంపల్లి మండలం గొడిగార్‌పల్లిలో ఓ ఇంట్లో, ఈ నెల 5న పట్టణంలోని వెంకటేశ్వర కాలనీలో దొంగతనానికి పాల్పడినట్లు నిందితులు ఒప్పుకున్నారు. వారి నుంచి రూ.12.50 లక్షల విలువైన 16 తులాల బంగారం, బైక్‌ను స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ తెలిపారు. నిందితులను అరెస్ట్ చేసి కోర్టు ఆదేశాలమేరకు రిమాండ్‌కు తరలించినట్టు వెల్లడించారు. నిందితులను పట్టుకున్న సిబ్బందికి నగదు రివార్డును అందజేశారు. సమావేశంలో పట్టణ సీఐ శివలింగం, ఎస్ఐ కాశీనాథ్ పాల్గొన్నారు.



కేసు వివరాలను వెల్లడిస్తున్న పోలీసులు

హ్యాండ్‌బాల్ పోటీలు షురూ

● 68వ రాష్ట్రస్థాయి అండర్-14 బాలబాలికలకు పోటీలు
● ఉమ్మడి జిల్లాల నుంచి 320 మంది విద్యార్థులు


క్రీడాజ్యోతిని వెలిగిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

హుస్నాబాద్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : హుస్నాబాద్ పట్టణంలోని మినీ స్టేడియంలో ఫ్లడ్ లైట్ల వెలుగుల మధ్య మూడు రోజుల పాటు జరిగే 68వ రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ అండర్- 14 బాలబాలికల పోటీలు శుక్రవారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. జాతీయ క్రీడాకారుడు జశ్వంత్ క్రీడాజ్యోతిని వెలిగించారు. ఉమ్మడి పది జిల్లాల నుంచి 320 మందితో పాటు 40 మంది కోచ్ మేనేజర్లు, వ్యాయామ ఉపాధ్యాయులు క్రీడాపోటీలకు వచ్చారు. ఇక్కడ ప్రతిభ కనబర్చిన విద్యార్థులు ఈనెల 25 నుంచి 29వరకు చత్తీస్‌ఘడ్‌లో నిర్వహించే జాతీయస్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో పాల్గొంటారని అధికారులు తెలిపారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో డీఈవో శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, గ్రంథాలయ చైర్మన్ కేడం లింగమూర్తి, ఎస్‌జీఎఫ్ సెక్రటరీ సౌందర్య, వైస్ చైర్ పర్సన్ అయిలేని అనిత, కౌన్సిలర్ కొంకటి నళినీదేవి, క్రీడల కన్వీనర్ రాగుల శ్రీనివాస్, ఎంఈవో మనీల, అబ్జర్వర్ శ్రీను, అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు అశోక్ తదితరులు పాల్గొన్నారు.



వివిధ జిల్లాల నుంచి వచ్చిన విద్యార్థులు

ఉత్సాహంగా ఫుట్‌బాల్ పోటీలు

● రాష్ట్రస్థాయికి 36 మంది క్రీడాకారుల ఎంపిక

మెదక్ అర్బన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక మెదక్ అవుట్‌డోర్ స్టేడియంలో అండర్-14 బాలబాలికలకు ఫుట్ బాల్ పోటీల ఎంపికలు ఉత్సాహంగా జరిగాయి. ఉమ్మడి మెదక్ జిల్లా నుంచి దాదాపు 300 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఫుట్‌బాల్ పోటీలను డీఈవో రాధాకిషన్ ప్రారంభించారు. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన 18 మంది చొప్పున బాలబాలికలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈనెలలో వనపర్తిలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా తరఫున పాల్గొంటారని ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి నాగరాజు తెలిపారు.


రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులు

ఫైనల్‌కు ఆదిలాబాద్, ఖమ్మం జట్లు

● కొనసాగుతున్న ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ టోర్నమెంట్

కొండాపూర్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కొండాపూర్ మండలం సీహెచ్.కోనాపూర్‌లో నిర్వహిస్తున్న అండర్-23 ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా శుక్రవారం సెమీ ఫైనల్ మ్యాచ్‌లు జరిగాయి. స్థానిక ఎంప క్రికెట్ గ్రౌండ్‌లో మొదటి సెమీ ఫైనల్ నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లా జట్ల మధ్య మ్యాచ్‌లు జరిగాయి. ఇందులో తొలుత బ్యాటింగ్ చేసిన ఆదిలాబాద్ జట్టు 47.2 ఓవర్లలో 252 పరుగులకు ఆలౌట్ అయింది. తర్వాత బ్యాటింగ్‌కు దిగిన నిజామాబాద్ జట్టు 237 పరుగులకు ఆలౌట్ కావడంతో 13 పరుగుల తేడాతో ఆదిలాబాద్ జట్టు విజయం సాధించి ఫైనల్‌కు చేరింది. రెండో సెమీఫైనల్ మ్యాచ్‌లో ఖమ్మం, నల్గొండ జిల్లా జట్ల మధ్య జరిగాయి. ఇందులో మొదట బ్యాటింగ్ చేసిన ఖమ్మం జట్టు 35.2 ఓవర్లలో 153 పరుగులకు ఆలౌట్ అయింది. తర్వాత బ్యాటింగ్ చేసిన నల్గొండ జట్టు 22.2 ఓవర్లలో 50 పరుగులకు ఆలౌట్ కావడంతో 102 పరుగుల తేడాతో ఖమ్మం జిల్లా జట్టు విజయం సాధించి ఫైనల్‌కు చేరింది. నేడు నిర్వహించనున్న ఫైనల్ మ్యాచ్‌లో ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లా జట్లు తలపడనున్నాయి.


ఫైనల్‌కు చేరిన ఆదిలాబాద్ జట్టు


ధర్మారంలో ఉపాధిహామీ ద్వారా పెంచుతున్న మామిడి తోట

పండ్ల తోటలకు ఉపాధిహామీ

దీర్ఘకాలికంగా ఆదాయాన్నిచ్చే తోటల పెంపకానికి చేయూత

● మూడేళ్ల వరకు నిర్వహణకు నిధులు
● మండలానికి 100 ఎకరాల లక్ష్యం
● సబ్సిడీపై డ్రిప్ సౌకర్యం

మద్దూరు, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ఉపాధి హామీ ద్వారా పండ్ల తోటల పెంపకానికి చేయూత నిస్తుండటంతో రైతులు ఆసక్తి చూపిస్తున్నారు. దీర్ఘకాలికంగా ఆదాయాన్నిచ్చే మామిడి, సీతాఫల్, మునగ, జామ, బత్తాయి, మల్బరీ తోటల పెంపకానికి ఉపాధి హామీని అనుసంధానించినట్లు ఉద్యాన శాఖ అధికారులు 2024-25 ఆర్థిక సంవత్సరంలో మండలానికి 100 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకానికి ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్దేశించింది. అంతేకాకుండా పండ్ల తోటల పెంపకానికి డ్రిప్ పరికరాలను ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకు పూర్తి సబ్సిడీపై, ఇతరులకు 10 శాతం రాయితీపై అందిస్తున్నారు.

151 ఎకరాల్లో పండ్ల తోటలు

మద్దూరు, దూళిమిట్ట మండలాల్లోని 23 గ్రామాల్లో సుమారు 50 మంది రైతులు పండ్ల తోటలకు దరఖాస్తు చేసుకున్నారు. మద్దూరు మండలంలో 38 మంది రైతులు 110 ఎకరాల్లో మామిడి, మునగ, మల్బరీ సాగు చేయగా, దూళిమిట్ట మండలంలో 41 ఎకరాల్లో 12 మంది రైతులు సాగు చేశారు.

నిర్వహణకు నిధులు

పండ్ల తోటలను ఏర్పాటు చేసుకున్న చిన్న, సన్నకారు రైతులకు మూడేళ్ల వరకు తోటల నిర్వహణకు ఉపాధి హామీ ద్వారా నిధులు అందిస్తోంది. ఒక్కో మొక్కకు రూ.30 అందిస్తుండగా నాటడానికి గుంత తీసినందుకు రూ.228, మొక్క నాటినందుకు రూ.46.24, రెండుమీటర్ల కర్ర నాటడానికి రూ.17.36 ఇవ్వనున్నారు. మొక్కలకు ఎరువులనందించేందుకు ఆరు మాసాలకోసారి ఒక్కో మొక్కకు రూ.25 చొప్పున ఏడాదిలో రెండుమార్లు నిధులు మంజూరవుతాయి. ఒక్కో మొక్క నిర్వహణకు నెలకు రూ.12.24 ఇవ్వనుంది. నెలకు రూ.3వేలు మించకుండా నిధులను మంజూరు చేస్తున్నట్లు ఉపాధిహామీ అధికారులు తెలిపారు.


లద్నూరులో అంతరపంటగా సాగు చేసిన బొబ్బెర

ఉపాధిహామీ చిన్న, సన్నకారు రైతులకు వరం



రెండెకరాల్లో మామిడి తోటను పెంచుతున్నాను. తోటల పెంపకంతో దీర్ఘకాలిక ప్రయోజనం చేకూరనుంది. ఉపాధిహామీతో చిన్న, సన్నకారు రైతులకు వరంగా మారింది. పంట చేతికందే వరకు నిర్వహణకు నిధులు మంజూరు చేస్తుండటంతో ఆర్థికంగా చేయూత అందుతుంది.

- పూట్ల రవీందర్‌రెడ్డి, ధర్మారం, రైతు

కాపు చేతికందే వరకు అంతర పంట సాగు చేస్తున్నా



మూడెకరాల్లో మామిడి మొక్కలు నాటుకున్నాం. కాపుకు వచ్చే వరకు అంతర పంటగా బొబ్బెర, మినుములు సాగు చేసుకున్నాం. ఉపాధిహామీ రైతులకు ప్రయోజనంగా ఉంది.

- బేజాడి పద్మ, లద్నూరు, రైతు

నెలాఖరులోపు దరఖాస్తు చేసుకోవాలి



నీటి వసతి కలిగి ఐదెకరాలలోపు ఉన్న చిన్న,సన్నకారు రైతులు ఈనెల 30లోపు గ్రామ పంచాయతీలో పండ్ల తోటలకు జాబ్‌కార్డు, కలిగి పట్టాదారుపాసు పుస్తకం, ఆధార్‌కార్డు, బ్యాంకు అకౌంట్ జిరాక్స్ ప్రతులతో దరఖాస్తు ఇవ్వాల్సి ఉంటుంది. గ్రామసభలో చేసిన తీర్మానం ప్రతిని అధికారులకు పంపించి మంజూరుకు కృషి చేస్తాం. దరఖాస్తు చేసుకున్న ఎస్సీ, ఎస్టీలకు పూర్తి సబ్సిడీతో పాటు బీసీ, ఓసీలకు 10 శాతం రాయితీతో డ్రిప్ సౌకర్యం మంజూరవుతుంది.

- పర్శరాములు, ఈసీ, మద్దూరు

కాంగ్రెస్ ప్రభుత్వానిది రాక్షసానందం

● అధికారం కట్టబెట్టింది ఆటంబాంబులు పేల్చడానికేనా?
● శాసనమండలి ప్రతిపక్ష నేత, మాజీ స్పీకర్ మధుసూదనాచారి


మాట్లాడుతున్న మధుసూదనాచారి

చేర్యాల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : అలవిగాని హామీలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని, తెలంగాణ సమాజంలో భయానక వాతావరణం సృష్టించి సీఎం రేవంత్‌రెడ్డి రాక్షసానందం పొందుతున్నారని శాసనమండలి ప్రతిపక్షనేత, మాజీ స్పీకర్, సిరికొండ మధుసూదనాచారి అన్నారు. చేర్యాల మండలం ఆకునూరు గ్రామంలో వీరబ్రహ్మం, మహమ్మాయి ఆలయాల నిర్మాణ భూమి పూజకు హాజరైన ఆయన విలేకరులతో మాట్లాడారు. త్వరలో ఆటంబాంబు పేలుతుందని మంత్రి పొంగులేటి అనడం సబబు కాదని, ప్రజలు అధికారం కట్టబెట్టింది బాంబులు పేల్చి విధ్వంసం సృష్టించడానికా.. అని ఎద్దేవా చేశారు. సమైక్య పాలనలో తెలంగాణ ప్రాంతానికి చేకూర్చిన అన్యాయంపై పోరాడి స్వరాష్ట్రాన్ని సాధించిన మాజీ సీఎం కేసీఆర్ తన కార్యదక్షతతో తెలంగాణను ఆదర్శంగా తీర్చిద్దారన్నారు. సమైక్యాంధ్ర పాలనలో రక్తం కారని రోజులేదని, కానీ బీఆర్ఎస్ హయాంలో ఎక్కడా విధ్వంసానికి, అరాచకాలకు తావివ్వకుండా ప్రజలకు రక్షణగా నిలవడంతో పాటు అభివృద్ధికి చిరునామాగా మార్చారని పేర్కొన్నారు. ప్రతిపక్షాల పట్ల సీఎం రేవంత్‌రెడ్డి అనుసరిస్తున్న పదజాలం బాగులేదన్నారు. ఆత్మ పరిశీలన చేసుకుని ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. రియల్‌ఎస్టేట్ రంగాన్ని నిర్వీర్యం చేయడంతో పాటు హైదరాబాద్‌లో పరిశ్రమలు కొనసాగించే పరిస్థితి లేకుండా చేశారన్నారు. దేవుళ్ల పేరిట ప్రమాణాలు చేయడమే తప్పా సీఎం రేవంత్‌రెడ్డి రైతుబంధు, పెన్షన్లు, రుణమాఫీ, నిరుద్యోగభృతి వంటివి అమలు చేయడంలో విఫలమయ్యారన్నారు. ప్రజలకు గులాబీ జెండాతోనే మంచి జరుగుతుందని, కాంగ్రెస్ నయవంచన పాలనకు చరమగీతం తప్పదన్నారు. ఆయన వెంట నాయకులు ఉల్లెంగల ఏకానందం, సుంకరి మల్లేశం తదితరులు ఉన్నారు.

క్రైం కార్నర్

డీసీఎం ఢీకొని ఒకరి మృతి


తలారి కిష్టయ్య(ఫైల్)

జోగిపేట, నవంబరు8 (ఆంధ్రజ్యోతి) : డీసీఎం ఢీ కొట్టడంతో ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని అల్మాయి పేట వద్ద చోటుచేసుకున్నది. జోగిపేట ఎస్‌ఐ పాండు కథనం ప్రకారం.. మండలంలోని నాదులాపూర్ గ్రామానికి చెందిన తలారి కిష్టయ్య(52) నేషనల్ హైవే కార్మికుడిగా పనిచేస్తున్నాడు. శుక్రవారం అల్మాయిపేట శివారులోని బసనాగుల బ్రిడ్జి వద్ద హైవేపై పనిచేస్తుండగా వేగంగా వస్తున్న డీసీఎం కిష్టయ్యను ఢీ కొట్టగా మృతి చెందాడు. ఘటనస్థలానికి చేరుకున్న ఎస్‌ఐ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జోగిపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

పాతకక్షతో మహిళ హత్య

● ముగ్గురి రిమాండ్


హత్య వివరాలు తెలుపుతున్న సీఐ

నర్సాపూర్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): పాతకక్షలతో పాటు తన పరువు పోయేలా ప్రచారం చేస్తున్న మహిళను అడ్డుతొలగించుకోవాలని మరో ఇద్దరి సహాయంతో ఓ మహిళ హత్య చేయించింది. నర్సాపూర్ సీఐ జాన్‌రెడ్డి, ఎస్‌ఐ లింగం తెలిపిన వివరాల ప్రకారం.. సెప్టెంబరు 11న నర్సాపూర్ మండలం ఎల్లరెడ్డిగూడెం తండాకు చెంది శాంతబాయి(45) అదృశ్యమైనట్లు కుటుంబీకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. విచారణ చేపట్టగా మూడురోజుల క్రితం గుమ్మడిదల మండలం నల్లవల్లి అటవీప్రాంతంలో గుర్తుతెలియని మహిళ శవం లభ్యమైనట్లు అక్కడి పోలీసుల ఆధారంగా నర్సాపూర్ పోలీసులు తెలుసుకున్నారు. ఆ మృతదేహం అదృశ్యమైన శాంతగా గుర్తించి దర్యాప్తు చేపట్టారు. అదే తండాకు చెందిన అరుణతో, శాంతకు పాతకక్షలు ఉన్నాయి. కల్లుదుకాణంలో పరిచయం ఉన్న కొండాపూర్‌కు చెందిన శ్రీనివాస్, వెంకటయ్యను అరుణ సంప్రదించి విషయం చెప్పి హతమారిస్తే శాంత ఒంటిపై ఉన్న నగలతో పాటు అదనంగా డబ్బు ఇస్తానని చెప్పి ఒప్పించింది. శాంతబాయి నర్సాపూర్‌కు కూరగాయాలు విక్రయించడానికి వెళ్లగా ఆమెకు మాయ మాటలు చెప్పడంతో ఒకే తండాపైగా స్నేహితురాలని నమ్మి నలుగురు కలిసి కల్లుదుకాణానికి వెళ్లి కల్లు తాగారు. ఆ తర్వాత వారు శాంతను గుమ్మడిదల మండలం నల్లవల్లి అటవీప్రాంతానికి తీసుకెళ్లి చీర కొంగుతో ఉరివేసి చంపేశారు. విచారణలో హత్య చేసినట్లు ఒప్పుకున్నందున ముగ్గురిని శుక్రవారం రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

మౌలాలి నుంచి నర్సాపూర్‌కు తప్పిపోయి వచ్చిన విద్యార్థి

● తల్లిదండ్రులకు అప్పగించిన అగ్నిమాపక సిబ్బంది


తండ్రికి బాలుడిని అప్పగిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

నర్సాపూర్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): నగరంలోని తన ఇంటి నుంచి స్కూల్ కోసం బయలుదేరిన విద్యార్థి నర్సాపూర్‌కు చేరుకుని తిరుగుతుండగా, అగ్నిమాపక సిబ్బంది గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించిన సంఘటన గురువారం రాత్రి చోటుచేసుకున్నది. అగ్నిమాపక సిబ్బంది కథనం ప్రకారం.. హైదరాబాద్‌లోని మౌలాలికి చెందిన పదో తరగతి విద్యార్థి గురువారం ఇంటి నుంచి స్కూల్ కోసం బయటకు వచ్చి, స్కూల్‌కు వెళ్లకుండా తప్పిపోయి నర్సాపూర్‌కు చేరుకున్నాడు. సాయంత్రం వేళ అగ్నిమాపక కేంద్రం వద్ద ఓ బాలుడు తిరుగుతుంటే సిబ్బంది అనుమానం వచ్చిన సిబ్బంది రమేష్ అతడి వద్దకు వెళ్లి వివరాలను కనుక్కున్నారు. ఇక్కడకు ఎలా వచ్చానో తెలియదని సమాచారం ఇచ్చి తన వివరాలను తెలిపాడు. తప్పిపోయి వచ్చి ఉంటాడని భావించి అతడిని అగ్నిమాపక కేంద్రం వద్ద ఉంచుకుని రాత్రిభోజనం పెట్టి బాలుడి తల్లిదండ్రులకు సమాచారమిచ్చారు. తల్లిదండ్రులు హుటాహుటిన రాత్రి 11 గంటల సమయంలో నర్సాపూర్‌కు చేరుకుని బాలుడిని తీసుకెళ్లారు. బాలుడి తల్లిదండ్రులు రమేష్, ఇతర అగ్నిమాపక సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

కులగణనను పకడ్బందీగా నిర్వహించాలి

● ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి, రాష్ట్ర ఆర్అండ్‌బీ ప్రత్యేక కార్యదర్శి దాసరి హరిచందన


గజ్వేల్‌లో సర్వే తీరును పరిశీలిస్తున్న ప్రత్యేకాధికారి హరిచందన, కలెక్టర్ మనుచౌదరి

గజ్వేల్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సామాజిక, ఆర్థిక, రాజకీయ కుల గణనను పకడ్బందీగా నిర్వహించాలని ఉమ్మడి మెదక్ జిల్లా ప్రత్యేకాధికారి, రాష్ట్ర ఆర్అండ్‌బీ ప్రత్యేక కార్యదర్శి దాసరి హరిచందన అన్నారు. గజ్వేల్ -ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని 20వ వార్డులో నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను ఆమె శుక్రవారం పరిశీలించారు. ఆయా అంశాలను గూర్చి ఎన్యూమరేటర్లను అడిగి తెలుసుకున్న ఆమె ఏమైనా సమస్యలు ఉన్నాయా అని ఆరా తీశారు. ఆమె వెంట కలెక్టర్ మనుచౌదరి, ఆర్డీవో వీవీఎల్ చంద్రకళ, తహసీల్దారు శ్రావణ్‌కుమార్, మున్సిపల్ కమిషనర్ గొల్కొండ నరసయ్య ఆర్ఐ కృష్ణ, ఎన్యూమరేటర్, సూపర్‌వైజర్, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

రామచంద్రాపూర్‌లో పరిశీలన

కుకునూరుపల్లి, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): రామచంద్రాపూర్ గ్రామంలో శుక్రవారం కలెక్టర్ మనుచౌదరితో కలిసి ప్రత్యేకాధికారి హరిచందన సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె గ్రామంలో అధికారులను అడిగి సర్వే తీరును తెలుసుకున్నారు. అధికారులు ఆమెకు సమాధానం ఇస్తూ గ్రామంలో 98 గృహాలకుగాను 119 కుటుంబాలను గుర్తించామని, హైదరాబాద్‌లో ఉన్నవారి వివరాలు నేరుగా ఫోన్ ద్వారా లేక కుటుంబసభ్యులను అడిగి తెలుసుకుంటున్నామన్నారు. ఆమె వెంట గజ్వేల్ ఆర్డీవో చంద్రకళ, ఎమ్మార్వో మల్లికార్జున్‌రెడ్డి, ఆర్ఐ, పంచాయతీ కార్యదర్శి నాగరాజు ఉన్నారు.

ధాన్యం కొనుగోలులో ఇబ్బందులకు గురి చేయవద్దు

చేర్యాల, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో కనీసవసతులు కల్పించాలని, త్వరితగతిన కొనుగోలు చేపట్టి రైతాంగాన్ని ఇబ్బందులకు గురిచేయకుండా చర్యలు తీసుకోవాలని ఉమ్మడి మెదక్ జిల్లా ప్రత్యేకాధికారి హరిచందన అన్నారు. కొమురవెల్లి మండలం మర్రిముస్త్యాల గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ మను చౌదరితో కలిసి పరిశీలించారు. కొనుగోలుకేంద్రంలోని ధాన్యం రాశులు, ప్యాడీ క్లీనర్లు, గన్నీ సంచులు నిల్వను పరిశీలించారు. ధాన్యం తేమశాతం యంత్రాన్ని పరిశీలించారు. కొనుగోలు కేంద్రానికి తీసుకువచ్చిన ధాన్యం నిర్ణీత తేమశాతం వచ్చిన వెంటనే తూకంపెట్టి మిల్లులకు తరలించా లని తెలిపారు. రైతుల వివరాలు ట్యాబ్ ఎంట్రీలో సత్వరం నమోదు చేసి త్వరితగతిన ధాన్యం డబ్బు ఖాతాలలో జమయ్యేలా చూడాలన్నారు. అకాల వర్షాలకు ధాన్యం తడవకుండా టార్పాలిన్లు సిద్ధంగా పెట్టాలని, తాగునీరు తదితర వసతులు విధిగా కల్పించి రైతులకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.

గురువులు కరువు

ఆంధ్రజ్యోతి విజిట్

ఐదో పేజీ తరువాయి

వస్తోంది. శుక్రవారం ఉమ్మడి మెదక్ జిల్లాలోని పలు పాఠశాలల్లో ఆంధ్రజ్యోతి పరిశీలించగా పలు విషయాలు వెలుగు చూశాయి.

విద్యార్థులు ఎక్కువ.. టీచర్లు తక్కువ

విద్యార్థులకు తగినట్లుగా ఉపాధ్యాయుల నియామకం ఉండాలిని విద్యాశాఖ నిబంధనలు సూచిస్తున్నాయి. కానీ విద్యార్థుల సంఖ్యకు తగినట్లుగా ఇవి కానరావడం లేదు. ఉమ్మడి జిల్లాలో ఇలాంటి పాఠశాలలు అనేకం ఉన్నాయి. ఉదాహరణగా ఈ పాఠశాలలను పరిశీలిస్తే..

● చేగుంట మండల కేంద్రంలోని బాలికల ప్రాథమిక పాఠశాలలో 81 మంది విద్యార్థులకు ఇద్దరు టీచర్లు మాత్రమే ఉన్నారు.
● అల్లాదుర్గం మండలం అప్పాజీపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో ఇద్దరే ఉపాధ్యాయులు ఉన్నారు. గత ఏడాది 61 మంది విద్యార్థులు ఉండగా ఉపాధ్యాయుల కొరత వల్ల ఆ సంఖ్య నేడు 48కి పడిపోయింది.
● గుమ్మడిదల మండలంలోని ప్రాథమిక పాఠశాలలో 200 మంది విద్యార్థులకు కేవలం ఆరుగురు టీచర్లు మాత్రమే ఉన్నారు. మరో ఇద్దరు అవసరం.
● బెజ్జంకి మండలంలోని నర్సింహులపల్లి ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి వరకు 25 మంది విద్యార్థులు మాత్రమే ఉండగా వీరందరికీ ఒకే ఉపాధ్యాయురాలు ఒక్క గదిలోనే పాఠాలు చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడింది.


అల్లాదుర్గం మండలం రాంపూర్‌లోని ప్రాథమికోన్నత పాఠశాలలో 8 తరగతుల్లోని 80 మంది విద్యార్థులతో ప్రార్థన చేయిస్తున్న ఒకే ఉపాధ్యాయుడు

ఈ స్కూళ్లలో రివర్స్..

ఉపాధ్యాయుల నియామకంలో సరైన విధానాలను అవలంబించకపోవడం వల్ల అనేక సమస్యలు తలెత్తుతున్నాయి. పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు అనుగుణంగా కాకుండా రకరకాల కోణాల్లో ఈ నియామకాలు ఉన్నట్లుగా అర్థమవుతున్నాయి. ఈ కింది పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉంటే ఉపాధ్యాయులు అంతకుమించి ఉండడమే నిదర్శనం.

● రామాయంపేట పట్టణంలోని అమ్మోరుగడ్డ ప్రాథమిక పాఠశాలలో 56 మంది విద్యార్థులకు నలుగురు టీచర్లు ఉన్నారు.
● అక్కన్నపేట మండలం గోవర్ధనగిరి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 101 మంది విద్యార్థులకు 9 మంది టీచర్లు పాఠాలు చెబుతున్నారు.
● సదాశివపేట మండలం నిజాంపూర్ మార్కండేయనగర్ కాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాలలో 21 మందికి ఏడుగురు విద్యార్థులే హాజరయ్యారు. ఇక్కడ ఇద్దరు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. విద్యార్థుల సంఖ్య తక్కువగా హాజరు కావడంతో గదికి తాళం వేశారు.
● కంది మండలంలోని చిమ్నాపూర్ ప్రాథమిక పాఠశాలలో 29 మంది విద్యార్థులకుగాను ముగ్గురు ఉపాధ్యాయులు ఉన్నారు.
● నారాయణరావుపేట మండలం ఏదుల్లవాడ ప్రాథమిక పాఠశాలలో కేవలం 13 మంది విద్యార్థులకు ఇద్దరు ఉపాధ్యాయులు ఉన్నారు.
● మిరుదొడ్డి మండలం ధర్మారం ప్రాథమిక ఉన్నత పాఠశాలలో 70 మంది విద్యార్థులకు ఆరుగురు ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు.


ఝరాసంగం మండలం భోజ్యానాయక్ తండాలో ఉపాధ్యాయులు లేక పాఠశాలకు తాళం

పరిష్కారానికి అనేక మార్గాలు

విద్యార్థుల సంఖ్యతోపాటు పాఠశాలల పరిస్థితులను సైతం పరిగణనలోకి తీసుకొని ఉపాధ్యాయుల నియామకం చేపట్టాల్సిన అవసరం విద్యాశాఖ అధికారులపై ఉంటుంది. విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉంటే సమీపంలో ఉన్న మరో స్కూల్‌లో విలీనం చేసి సదరు ఉపాధ్యాయుల సేవలు వాడుకోవాలి. లేదంటే ఎక్కువ మంది ఉపాధ్యాయులు ఉంటే వారిని ఇతర పాఠశాలలకు అడ్జస్ట్ చేస్తూ ఆర్డర్లు ఇవ్వాలి. ఫలితంగా విద్యార్థులకు సరైన ప్రాధాన్యత దక్కుతుంది. ఈ విషయంపై విద్యాశాఖ అధికారులకు పూర్తి అవగాహన ఉన్నప్పటికీ ఆచరణలో మాత్రం జాప్యం జరుగుతోంది.

రైతులకు మొబైల్ యాప్‌పై శిక్షణ

సంగారెడ్డి రూరల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): రైతులకు మొబైల్ యాప్ వినియోగంపై సంగారెడ్డిలోని శిక్షణాకేంద్రంలో శుక్రవారం కేంద్రీయ సమగ్ర సస్య రక్షణ కేంద్రం అధ్వర్యంలో శిక్షణ అందించారు. ఈ సందర్భంగా కేంద్రం అధికారి సునీత మాట్లాడుతూ ఎన్‌పీఎస్ఎస్ మొబైల్ యాప్ ద్వారా పంటలను ఆవహించే పురుగులు, తెగుళ్లను త్వరిత గతిన గుర్తించవచ్చని అన్నారు. కార్యక్రమంలో వెంకటొరెడ్డి, ఉమాశంకర్, ఎఫ్‌టీసీ ఏడీఏ రామకృష్ణ, ఏడీఏ దివ్యజ్యోతి, రాహుల్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మీనరసింహస్వామి ఆలయ వార్షికోత్సవం

చిన్నశంకరంపేట, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ముదిరాజ్ సంఘం అధ్వర్యంలో శ్రీ లక్ష్మీనరసింహస్వామి వార్షికోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలోని స్వామివారికి ప్రత్యేక పూజలు, హోమం, తదితర కార్యక్రమాలు నిర్వహించారు.

జక్కన్నపేటలో పాఠశాల తనిఖీ

హవేళిఘణపూర్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జక్కన్నపేట ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలను డీఈవో రాధాకృష్ణ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు.

డాక్టర్ సీటు సాధించిన విద్యార్థికి సాయం

మునిపల్లి, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దచెల్మెడ గ్రామానికి చెందిన సంగారి సంతోష్‌కుమార్ ఇటీవల బీహెచ్ఎంఎస్ లో సీటు సాధించాడు. అతడి ఉన్నత చదువుకు గ్రామానికి చెందిన ఆర్టీసీ ఉద్యోగులు, గ్రామస్థులు రూ.25వేలు అందించారు.

ఆదాయం ఉన్నా.. అందని ఆర్టీసీ సేవలు

- తిరోగమనంలో ఖేడ్ డిపో
- వేధిస్తున్న సిబ్బంది కొరత
- కొత్త బస్సులూ లేవు
- గ్రామాలకు బస్సు సౌకర్యం లేక ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్న ప్రజలు


నారాయణఖేడ్ ఆర్టీసీ డిపో

నారాయణఖేడ్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఆదాయం ఘనంగా ఉన్నప్పటికీ, అవసరానికి అనుగుణంగా బస్సులు నడపక, తగినంత సిబ్బంది లేక ఖేడ్ ఆర్టీసీ డిపో తిరోగమనం బాటలో పయనిస్తున్నది. జిల్లాలోనే మారుమూలప్రాంతంలో కర్ణాటక, మహారాష్ట్రల సరిహద్దుల్లో నారాయణఖేడ్ డిపో ఉన్నప్పటికీ, ఈ డిపో నుంచి ఇతర రాష్ట్రాలకు బస్సు సౌకర్యం మాత్రం అంతంత మాత్రంగానే ఉంది. ఖేడ్ ప్రాంతంలోని గ్రామీణ ప్రాంతాలకూ బస్సు సౌకర్యం అవసరమైనంతగా లేదనే చెప్పవచ్చు. కేవలం హైదరాబాద్ రూట్లో బస్సులు నడపడానికే ఆర్టీసీ అధికారులు ఆసక్తి చూపడం గమనార్హం.

గతంలోనే కొంత నయం

దశాబ్దం క్రితం ఖేడ్ డిపో పరిధిలో నడిపిన గ్రామీణ రూట్లలో కూడా ప్రస్తుతం బస్సులు నడిపించకపోవడంతో ప్రయాణికులు ప్రైవేటు వాహనాలనే ఆశ్రయించాల్సివస్తుంది. నారాయణఖేడ్ నుంచి ఫుల్‌కూర్తిమీదుగా జహీరాబాద్‌కు రెండు నైట్ హాల్ట్‌లు, మూడు స్పెషల్ ఆఫ్ బస్సులు, మొత్తంగా 16 ట్రిప్పులు నడిపేవారు. నారాయణఖేడ్ నుంచి కర్ణాటకలోని బీదర్‌కు కూడా రోజూ 16 వరకు బస్సులు నడిపేవారు. ప్రస్తుతం జహీరాబాద్, బీదర్ రూట్లలో బస్సులు అరకొరగా నడుపుతున్నారు. కంగ్టి, పిట్లం రూట్లలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. గతంలోను డిపో పరిధిలో రోజుకు 21 వేల కిలోమీటర్లు బస్సులు నడిపేవారు. ప్రస్తుతం ప్రతి రోజూ 21,500 కిలోమీటర్ల మేర బస్సులు నడుపుతున్నా, హైదరాబాద్ ప్రాంతానికే పరిమితం కావడంతో, డిపో ఉన్న ఈ ప్రాంతంలోని గ్రామాలకు బస్సులు నడపడం లేదు. అప్పట్లో ఖేడ్ డిపో పరిధిలో 70 బస్సులు ఉండగా, 60 షెడ్యూల్ నడిచేవి. నారాయణఖేడ్‌లో 6 సూపర్ లగ్జరీ బస్సులు, ఖేడ్ నుంచి గుంటూరుకు నడిపేవారు.

> **సిబ్బంది కొరతవల్లే ..**
>
> డిపోలో సిబ్బంది కొరత ఉండగా, ప్రధానంగా డ్రైవర్ల కొరత అధికంగా ఉంది. నూతన సిబ్బంది నియామకాలు లేక, ఉన్న సిబ్బంది పదవి విరమణ చేస్తుండడంతో, పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అందువల్లే ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఉన్న సిబ్బందితోనే మెరుగైనసేవలు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నాం. బస్సుల సంఖ్యను పెంచి, సిబ్బందిని పూర్తి స్థాయిలో నియమిస్తే అన్ని రూట్లలో బస్సులు నడుపుతాం.
>
> -మల్లేశయ్య, డీఎం, నారాయణఖేడ్

సిబ్బంది కొరత.. కాలం చెల్లిన బస్సులు

ఖేడ్ డిపోలో బస్సుల సంఖ్యకు అనుగుణంగా కండక్టర్, డ్రైవర్లు, ఏడీసీలు, మెకానికల్ శ్రామికులు కలిపి మొత్తం 400మంది వరకు సిబ్బంది ఉండేవారు. ప్రస్తుతం 241 మంది మాత్రమే ఉన్నారు. డిపోలో ఉన్న బస్సుల సంఖ్యకు అనుగుణంగా 2.6 నిష్పత్తితో డ్రైవర్, కండక్టర్లు ఉండాల్సి ఉన్నప్పటికీ, ప్రస్తుతం కండక్టర్లు 114 మంది, డ్రైవర్లు 80 మంది, ఇతర విభాగాల్లో కలిపి 47 మంది ఉన్నారు. ఆర్టీసీ డిపోలో బస్సులు కూడా ఆర్టీసీకి సంబంధించి 46బస్సులు ఉండగా, అద్దె(హైర్) బస్సులు 14 ఉన్నాయి, ఇందులో 15 పల్లె వెలుగు బస్సులు సంస్థవి ఉండగా, 8 హైర్ సర్వీసులున్నాయి. 3 డీలక్స్, 2 సూపర్ లగ్జరీ బస్సులున్నాయి. ఎక్స్‌ప్రెస్ బస్సులు 21సంస్థవి ఉండగా, 6 హైర్ బస్సులు, 3 స్పేర్‌బస్సులు ఉన్నాయి. సంస్థకు సంబంధించి 50 శాతం బస్సులు కాలం చెల్లినవే ఉన్నాయి.

ఆదాయం పెరిగినా...

మహాలక్ష్మీ పథకం అమల్లోకి వచ్చాక ఈపీకే శాతం 45 చొప్పున వస్తుంది. అంతకుముందు 35 చొప్పున వచ్చేవి. అప్పట్లో ప్రతిరోజూ రూ.8లక్షల వరకు ఆదాయం వచ్చేది. ప్రస్తుతం సిబ్బంది కొరత, బస్సుల కొరత ఉన్నప్పటికీ రూ.11 లక్షల వరకు ఆదాయం వస్తుంది. ఆదాయం పెరిగినా కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాలతో పాటు గ్రామీణ ప్రాంతాలకు బస్సులు ఆశించిన స్థాయిలో నడపకపోవడంతో ఇక్కడ డిపో ఉన్నా ప్రజలకు ఎలాంటి అవసరమైనస్థాయిలో ప్రయోజనం లేకుండాపోయిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. సిబ్బంది కొరత కూడా ప్రధానంగా ఉండడంతో, డీలక్స్ బస్సుతో పాటు సూపర్ లగ్జరీ బస్సులను వన్ మెన్ సర్వీస్‌గా నడుపుతున్నారు.

పస్తాపూర్‌లో ఎండు గంజాయి పట్టివేత

జహీరాబాద్, నవంబరు 8: పట్టణంలోని పస్తాపూర్‌లో గల ఉత్తం వెంచర్ సమీపంలో మహారాష్ట్రకు చెందిన రహ్మత్‌అహ్మద్ గురువారం రాత్రి ద్విచక్రహనంపై ఎండుగంజాయిని జహీరాబాద్‌కు తరలిస్తున్న సమయంలో అదుపులోకి తీసుకున్నట్లు ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తెలిపారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. పస్తాపూర్ సమీపంలోని ఉత్తంవెంచర్ వద్ద వాహనాల తనఖీలు నిర్వహిస్తుండగా పట్టుబడినట్లు తెలిపారు. నిందితుడు కర్ణాటకలోని బీదర్ నుంచి తరచూ గంజాయిని తీసుకువచ్చి జహీరాబాద్ పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తుంటాడని తెలిపారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని ఒకటిన్నర కిలోల గంజాయితో పాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. కేసు దర్యాప్తు జరుపుతున్నామన్నారు. తనిఖీల్లో సీఐ. గాంధీనాయక్, ఎస్ఐ.యాదయ్య సిబ్బంది అలీం, మల్కయ్య, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేరస్థుల గుర్తింపులో సీసీ కెమెరాలు కీలకం: డీఎస్పీ


వెల్దుర్తి పోలీస్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డీఎస్పీ

వెల్దుర్తి, నవంబరు8(ఆంధ్రజ్యోతి): నేరస్థుల గుర్తింపులో సీసీ కెమెరాలు ఎంతో దోహదపడుతాయని, ప్రతీ గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని తూప్రాన్ డీఎస్పీ వెంకట్‌రెడ్డి సూచించారు. శుక్రవారం వెల్దుర్తి పోలీస్ స్టేషన్‌ను డీఎస్పీ ఆకస్మికంగా సందర్శించి తూప్రాన్ సీఐ రంగకృష్ణతో కలిసి పలు రికార్డులను పరిశీలించారు. వెల్దుర్తి పోలీస్ స్టేషన్‌కు సంబంధించిన పూర్తి వివరాలను ఎస్ఐ రాజును అడిగి తెలుసుకున్నారు.

పటాన్‌చెరులో ఘనంగా ఛాట్‌పూజ

పటాన్‌చెరు, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఉత్తరభారతీయులు ఘనంగా జరుపుకునే ఛాట్ పూజా ఉత్సవాన్ని శుక్రవారం పటాన్‌చెరు పట్టణంలో ఘనంగా జరుపుకున్నారు. సాకిచెరువు కట్టపై నిర్వహించిన పూజా కార్యక్రమంలో వేలాదిగా దక్షిణాది కుటుంబాలు పాల్గొని సూర్యభగవానుడికి నైవేద్యాలు సమర్పించారు. ముఖ్యంగా ఈ పూజా కార్యక్రమంలో ఉత్తర్‌ప్రదేశ్, రాజస్థాన్, బీహార్, ఛత్తీస్‌ఘడ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన వలస ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పూజలో నైవేద్యంగా సమర్పించే చెరుకు గడలను ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి పెద్ద ఎత్తున పంపిణీ చేశారు.

పశుపోషణలో సాంకేతిక పరిజ్ఞానం వాడాలి

జహీరాబాద్, నవంబరు 8: పాడి రైతులు పశుపోషణలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగించుకోవాలని డీడీఎస్-కేవీకే శాస్త్రవేత్త డా. కైలాష్, పశువైద్యులు అంజిక్య పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని కాశీంపూర్ గ్రామంలో డీడీఎస్-కేవీకే ఆధ్వర్యంలో పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేలు జాతిదూడల పెంపకం ద్వారా రైతులకు రెట్టింపు ఆదాయం వస్తుందన్నారు. మొగుడంపల్లి మండలంలో నిర్వహించిన కార్యక్రమంలో డీడీఎస్-కేవీకే శాస్త్రవేత్త స్వామి మాట్లాడుతూ రైతులు భూసారపరీక్షలు చేసుకోవాలన్నారు. పంటలను చీడ,పీడలు ఆశించకుండా రైతులు పొలాల్లో లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఆయా కార్యక్రమాల్లో రైతులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పరిశ్రమను సందర్శించిన డిగ్రీ విద్యార్థులు


పరిశ్రమలో ఉత్పత్తి తయారీ విధానంపై వివరిస్తున్న కంపెనీ హెచ్ఆర్

నర్సాపూర్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దచింతంకుంట ప్రభుత్వ డిగ్రీ కాలేజీ బీఎస్సీ విద్యార్థులను సంగారెడ్డి జిల్లాలోని న్యూలాండ్ పరిశ్రమకు తీసుకెళ్లి అక్కడ పరిశ్రమలో పనితీరుపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దామోదర్, అధ్యాపకులు సురేష్, రమేష్, సురేష్, సౌజన్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులకు కంపెనీలో ఔషధాల తయారీ విధానంపై వివరించిన పరిశ్రమ హెచ్ఆర్ వీరప్రసాద్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

'చిన్నారులకు పౌష్టికాహారం తప్పనిసరి'

హత్నూర, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు పౌష్టికాహారం అందజేయాలని జడ్పీ డిప్యూటీ సీఈవో, మండల ప్రత్యేక అధికారి స్వప్న పేర్కొన్నారు. శుక్రవారం కోనంపేట, కొత్తగూడెం అంగన్‌వాడీ కేంద్రాలను ఆమె పరిశీలించారు. చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలని సూచించారు. అదేవిధంగా చింతల్‌చెర్వు, రెడ్డిపాలెం గ్రామాలలో కొనసాగుతున్న ఇంటింటి సర్వేను వారు పరిశీలించారు.

జిల్లా స్థాయిలో శ్రీమద్ భగవద్గీతా కంఠస్థ పోటీలు

చిలప్‌చెడ్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): మండలంలోని జగ్గంపేట గ్రామంలో గల నవభారతి మోడల్ స్కూల్‌లో గీతా జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని జిల్లాస్థాయిలో శ్రీమద్ భగవద్గీతా కంఠస్థ పోటీలను నిర్వహిస్తున్నట్లు టీటీడీ కార్యక్రమ నిర్వాహకుడుకె. లక్ష్మీనారాయణ శర్మ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. మండలం పరిధిలోని నవభారతి మోడల్ స్కూల్ జగ్గంపేటలో 6, 7 మరియు 8,9 తరగతుల విద్యార్థులకు భగవద్గీత కంఠస్థ పోటీలను టీటీడీ ఆధ్వర్యంలో రెండు విభాగాలుగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో ఆసక్తి గల విద్యార్థులు 9704742553, 9440214296, 9000974500 సంప్రదించవచ్చునని తెలిపారు.

మెదక్ జిల్లాలో లక్షా 43వేల 80 ఇండ్ల జాబితా నమోదు: కలెక్టర్


మెదక్ ఒకటో వార్డులో ఎన్యుమరేటర్లకు కుటుంబ సమాచారాన్ని అందజేస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ మున్సిపాలిటీ, నవంబరు 8: కుల సర్వేలో భాగంగా ప్రతి ఇంటిని నమోదు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ ఆదేశించారు. గృహాల జాబితా మూడో రోజులో భాగంగా శుక్రవారం పట్టణంలోని ఒకటో వార్డు ఔరంగాబాద్‌లోని కలెక్టర్ నివాసంలో అధికారంలో సమగ్ర కుటుంబ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా వచ్చిన మున్సిపల్ కమిషనర్, ఎన్యుమరేటర్లకు కలెక్టర్ పూర్తి సమాచారాన్ని అందజేశారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ఇప్పటివరకు జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో లక్షా 23,326 ఇళ్ల జాబితా నమోదు చేయగా పట్టణ ప్రాంతాల్లో 19,754, జిల్లా వ్యాప్తంగా లక్షా 43,080 ఇళ్ల జాబితా నమోదు పూర్తి చేసినట్లు వివరించారు. గృహాల జాబితా చివరి రోజు తమ ఇంటిని సర్వే చేసి సతీమణి సంగిరెడ్డి శ్రీజ ఇంటి యజమానిగా కుటుంబ సభ్యుల వివరాలు నమోదు చేశారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, ఎన్యుమరేటర్ల, సిబ్బంది పాల్గొన్నారు.

● తూప్రాన్/నర్సాపూర్/చిలప్‌చెడ్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సమగ్ర కుటుంబ ఇంటింట సర్వేను కొత్త పార్మెట్ ప్రకారం చేయాలని తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం తూప్రాన్ మున్సిపల్ కార్యాలయంలో తూప్రాన్ డివిజన్‌లోని ఎంపీడీఓ, తహసీల్దారు, సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. కొత్త ఫార్మెట్‌లో జరిగిన మార్పులు, చేర్పులపై అవగాహన కల్పించారు. మండలంలోని వెంకటాయపల్లిలో శుక్రవారం నిర్వహించిన ఇంటింటి సర్వేను తహసీల్దారు విజయలక్ష్మి పర్యవేక్షించారు. నర్సాపూర్ ఆర్డీవో కార్యాలయంలో సర్వేకు సూపర్‌వైజర్లుగా నియామకమైన అధికారులతో ఆర్డీవో మహిపాల్‌రెడ్డి సమావేశం నిర్వహించారు. నిర్దేశించిన గడువులోపు ఎన్యూమరేటర్లతో సర్వే పూర్తయ్యేలా చూడాలని, సమాచారం పక్కాగా సేకరించాలన్నారు. చిలప్‌చెడ్ ఎంపీడీవో కార్యాలయంలో సూపర్ వైజర్లతో ఆర్డీవో సమావేశాన్ని నిర్వహించి వారికి తగిన సూచనలు చేశారు.

సంగారెడ్డి జిల్లాలో..

జిన్నారం/ఫుల్‌కల్/కంది, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): బొల్లారం మున్సిపాలిటీలో సమగ్ర కుటుంబ సర్వేను జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ పరిశీలించారు. కుటుంబసభ్యుల వివరాలను సిబ్బంది సేకరించి, నమోదు చేస్తున్న విధానాన్ని పరిశీలించారు. అనంతరం మున్సిపల్ అధికారులతో సమీక్షను జరిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మంగతాయారు పాల్గొన్నారు. ఫుల్‌కల్ మండలంలోని కోర్పోలు, సరాఫ్‌పల్లి గ్రామాలను జిల్లా పంచాయతీ అధికారి సాయిబాబా ఆకస్మికంగా సందర్శించారు. ఆయా గ్రామాల్లో పర్యటించి ఎన్యూరేటర్లతో సమావేశమై పలు సూచనలు చేశారు. కంది మండలకేంద్రంలో శుక్రవారం సమగ్రసర్వేను జడ్పీ సీఈవో జానకిరెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు.

మంచినీటి ట్యాంకు వద్ద మురుగు తొలగింపు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఫుల్‌కల్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ మండలం శేరిరాంరెడ్డిగూడెంలోని మంచినీటి ట్యాంకు వద్ద పారిశుధ్య పనులు నిర్వహించారు. ట్యాంకు నిండి నీరంతా వృథాగాపోతూ బురదమయంగా మారిన విషయం 'ఆంధ్రజ్యోతి' దినపత్రికలో శుక్రవారం ప్రచురితం కావడంతో అధికారులు స్పందించారు. ట్యాంకు పరిసరాలను శుభ్రం చేయడంతో పాటు పైపులైన్ లీజీకేకి మరమ్మతు చేయించారు.

'నాస్' పరీక్షకు సన్నద్ధం చేయాలి

మెదక్ అర్బన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 4న జరిగే నేషనల్ అచీవ్‌మెంట్ సర్వే పరీక్షలకు విద్యార్థులను సన్నద్ధం చేయాలని డీఈవో రాధాకిషన్ ఎంఈవోలకు సూచించారు. శుక్రవారం ఎంఆర్సీ కార్యాలయంలో జిల్లాలోని ఎంఈవోలతో నిర్వహించిన సమావేశంలో డీఈవో మాట్లాడుతూ.. నాణ్యమైన విద్య అందేవిధంగా కృషి చేయాలని సూచించారు.

'రోగులకు సరైన వైద్యమందించాలి'

మనోహరాబాద్, నవంబరు (ఆంధ్రజ్యోతి) 8: రోగులకు సరైన వైద్యమందించాలని మెదక్ జిల్లా వైద్యాధికారి శ్రీరామ్ అన్నారు. శుక్రవారం మనోహరాబాద్ మండలంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఆస్పత్రిలో రోగులకు అందుతున్న వైద్యసేవల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది సమయపాలన పాటించడం లేదని తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జిల్లా వైద్యాధికారి జ్ఞానేశ్వర్, శంకర్‌రాథోడ్, మండల వైద్యాధికారి జ్యోష్నదేవి, సీహెచ్‌వో బాలనర్సింహులు పాల్గొన్నారు.

'విద్యార్థుల్లో నైపుణ్యాన్ని వెలికితీయాలి'

నారాయణఖేడ్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లోని నైపుణ్యాన్ని వెలికితీయాలని జనవిజ్ఞాన వేదిక సలహాదారుడు శ్రీనివాస్‌రాథోడ్ అన్నారు. నారాయణఖేడ్ పరిధిలోని మండల కేంద్రమైన నిజాంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యాశాఖ సర్వశిక్షా అభియాన్, జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో విద్యార్థులకు చెకుముఖి సైన్స్ టాలెంట్ టెస్టు పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా 8, 9, 10 తరగతులు చదువుతున్న విద్యార్థులకు 40 ప్రశ్నలతో, ప్రశ్నాపత్రాలు అందించారు. మండల స్థాయిలో ఈనెల 21, జిల్లాస్థాయిలో 28, రాష్ట్రస్థాయిలో డిసెంబరులో పరీక్షలు నిర్వహిస్తామన్నారు.

కొనుగోళ్లు ఇంకెప్పుడు?

- ఎమ్మెల్యే చింతా ప్రభాకర్

సంగారెడ్డి టౌన్, నవంబరు 8 (ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ సీజన్ వరి పంట కోతలు ప్రారంభమై పక్షం రోజులు గడుస్తున్నా కొనుగోళ్లు మాత్రం చేపట్టడం లేదని సంగారెడ్డి ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు చింతా ప్రభాకర్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని అనేక ప్రాంతాల్లో వడ్ల కొనుగోళ్లు ప్రారంభం కాలేదన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో ప్రభుత్వ ప్రకటనలకు, ఆచరణకు పొంతన లేదన్నారు. జిల్లాలో 213 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించిందని, అయితే ఏ ఒక్క కొనుగోలు కేంద్రంలోనూ ఇంతవరకూ కొనుగోళ్లు ప్రారంభమే కాలేదన్నారు. తక్షణమే కొనుగోళ్లను ప్రారంభించాలని చింతా ప్రభాకర్ డిమాండ్ చేశారు.


వేడుకల్లో సోమవంశసహస్రార్జున క్షత్రియసమాజ్ సభ్యులు, మహిళలు

ఘనంగా కార్తవీర్యార్జున జయంతి

సంగారెడ్డి అర్బన్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సంగారెడ్డిలో సోమవంశ సహస్రార్జున క్షత్రియ సమాజ్(ఎస్ఎస్‌కే) ఆధ్వర్యంలో శ్రీరాజరాజేశ్వర కార్తవీర్యార్జున జయంతి మహోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎస్ఎస్‌కే భవన్‌లో ఆయన చిత్రపటానికి సమాజ్ సభ్యులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అంబేడ్కర్ చౌక్ నుంచి ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు కోలాటాలతో సందడి చేశారు. సమాజ్ సంగారెడ్డి అధ్యక్షుడు చందర్, కార్యవర్గసభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి

వెల్దుర్తి/తూప్రాన్, నవంబరు8(ఆంధ్రజ్యోతి): రైతులు ధాన్యాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలని తూప్రాన్ ఆర్డీవోజయచంద్రారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వెల్దుర్తి మండల పరిధిలోని హస్తాల్‌పూర్, మేల్లారు గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించి మాట్లాడారు. తూప్రాన్ మండలం దాతర్‌పల్లి, గుండ్రెడ్డిపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలను శుక్రవారం తహసీల్దారు విజయలక్ష్మి సందర్శించారు. ఏమైనా ఇబ్బందులు ఏర్పడితే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.

ఘనంగా రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు


మెదక్‌లో సీఎం జన్మదిన కేక్ కట్ చేసి అభిమానులకు తినిపిస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు, మాజీ ఎమ్మెల్యేలు మైనంపల్లి హన్మంతరావు, మదన్‌రెడ్డి తదితరులు



బొల్లారంలో కేక్‌కట్ చేస్తున్న మున్సిపల్ కౌన్సిలర్ చంద్రారెడ్డి తదితరులు, గుమ్మడిదలలో కేక్ తినిపించుకుంటున్న నాయకులు

న్యూస్ నెట్‌వర్క్, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలు సంగారెడ్డి, మెదక్ జిల్లాల్లో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా మండలాల్లో కాంగ్రెస్ నాయకులు కేక్‌లు కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. పలుచోట్ల ఆస్పత్రుల్లో పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు.

సంగారెడ్డిలో..

పటాన్‌చెరులో ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి కాంగ్రెస్ నాయకులతో కలిసి స్థానిక ఏరియా ఆసుపత్రిలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. వట్‌పల్లిలో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ కేకును కట్ చేశారు. బొల్లారం మున్సిపాలిటీలో పాత మున్సిపల్ కార్యాలయం వద్ద కౌన్సిలర్ చంద్రారెడ్డి, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు జైపాల్‌రెడ్డి, పార్టీ నాయకుల సమక్షంలో కేక్‌ను కట్ చేశారు. జహీరాబాద్ పట్టణంలోని వేర్వేరు ప్రాంతాల్లో రాష్ట్ర సెట్విన్ కార్పొరేషన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, మాజీమంత్రి డా. చంద్రశేఖర్, రాష్ట్ర కాంగ్రెస్ సీనియర్ నాయకుడు డా. సిద్దం ఉజ్వల్‌రెడ్డిల ఆధ్వర్యంలో కేకులను కట్‌చేసి పంచిపెట్టారు. ఝరాసంగంలో హెల్మెట్‌ల పంపిణీ కార్యక్రమానికి జహీరాబాద్ ఎంపీ సురేష్‌కుమార్ షెట్కార్ హాజరయ్యారు. ఎమ్మెల్యే పట్లోళ్ల సంజీవరెడ్డి శుక్రవారం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని సీఎం నివాసంలో కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఖేడ్ శివార్లలోని గిరిజన గురుకుల పాఠశాలలో విద్యార్థులకు రేవంత్‌రెడ్డి చిత్రాన్ని వేయడంపై పోటీలు నిర్వహించారు. గుమ్మడిదలలోని అంబేడ్కర్ చౌరస్తాలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పుట్టా నర్సింగరావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు.

మెదక్‌లో...

సీఎం రేవంత్‌రెడ్డి జన్మదిన వేడుకలను మెదక్ పట్టణంలోని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో రా రైస్ మిల్లర్స్ ఎంఎస్ఎస్‌వో ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు కేక్ కట్ చేశారు. దాదాపు వెయ్యి మంది కార్మికులు, ఆశా కార్యకర్తలకు చీరలను పంపిణీ చేశారు. వేడుకల్లో నర్సాపూర్ మాజీ ఎమ్మెల్యే మదన్‌రెడ్డి, నర్సాపూర్, దుబ్బాక, సిద్దిపేట, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జిలు రాజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, హరికృష్ణ, నక్కా ప్రభాకర్‌గౌడ్, రా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ పాడి గణపతిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి జిల్లా అధ్యక్షుడు ఉట్కూరి వీరేశం, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, మాజీ కౌన్సిలర్లు వెంకటరమణ, సులోచన, జ్యోతి, సీనియర్ నాయకులు శ్రీనివాస్‌చౌదరి, బోస్, ఉప్పల రాజేశ్, రవి, దేమె యాదగిరి, హఫీజొద్దీన్, అంజనేయులుగౌడ్, శంకర్, తదితరులు పాల్గొన్నారు. చేగుంట గాంధీ విగ్రహం వద్ద దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు వడ్ల నవీన్‌లు కేక్ కట్ చేశారు. నార్సింగిలో మండల పార్టీ అధ్యక్షుడు అకుల శ్రీనివాస్‌గౌడ్, కాంగ్రెస్ నాయకులు కేక్ కట్ చేశారు. నర్సాపూర్ మండలంలోని చిప్పల్‌తుర్తి సమీపంలో కస్తూర్బా పాఠశాలలో విద్యార్థినుల మధ్య గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసినీరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, నియోజకవర్గ ఇన్‌చార్జి రాజిరెడ్డి కేక్ కట్ చేశారు. శివ్వంపేట మండలంలో కాంగ్రెస్ నాయకులు బాలింతలకు బ్రెడ్ ప్యాకెట్లు పంపిణీ చేయగా, పిల్లుట్లలో విద్యార్థులకు బిస్కెట్లు, పండ్లు పంపిణీ చేశారు. తూప్రాన్‌లోని మున్సిపల్ కార్యాలయ ఆవరణలో చైర్‌పర్సన్ మామిండ్ల జ్యోతికృష్ణ ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. స్థానిక ఆసుపత్రిలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. చిన్నశంకరంపేట, కొల్చారం, మనోహరాబాద్, హవేళిఘనపూర్ మండలాల్లో కాంగ్రెస్ నాయకులు సీఎం జన్మదిన కేక్‌లను కట్ చేసి పరస్పరం తినిపించుకున్నారు.


వట్‌పల్లిలో కేక్‌వేడుకలు జరుపుకుంటున్న నాయకులు

ఓటరుగా నమోదు చేసుకోవాలి

నాగల్‌గిద్ద, నవంబరు 8(ఆంధ్రజ్యోతి): ఈనెల 9, 10 తేదీల్లో ఓటరు నమోదుకు స్పెషల్ క్యాంపులు ఉంటాయని, 18 ఏళ్లు నిండితే ఓటరుగా నమోదు చేయించుకోవాలని నాగల్‌గిద్ద ఇన్‌చార్జి తహసీల్దార్ శివరాంక్రిష్ణ సూచించారు.